## 6

# ఒకరినొకరు ప్రేమించుడి

మొదటి యోహానులో క్రైస్తవ విశ్వాసం యొక్క వాస్తవికథల గురించి నొక్కి వక్కానించ బడింది. జీవితాల్లో అనేక అవాస్తవాలు సంభవించడం జరుగుతుంది. అది ఎలా అంటే, అసలు మార్చలేము అన్న విషయాలు మారిపోతున్నాయి. కొన్ని విషయాలు వాస్తవమని తెలుసుకోవటం ఎంతైన మంచిది. వాటి మీద మనం అధారపడవచ్చు, అవి సత్యాలు కూడ; ఆ వాస్తవాల్లో ప్రాముఖ్యమైనవి: క్రైస్తవులు తండ్రితో సహవాసం కలిగి ఆనందించ వచ్చు అనునది, కుమారుని ద్వారా రక్షణ పొందవచ్చు, మరియు పాపం పై విజయాన్ని పొందవచ్చు అనేవి ఆ వాస్తవాలలో కొన్నిగా ఉన్నాయి.

ఈ పాఠంలో మరికొన్ని, వాస్తవాల గురించి మనం ప్రస్తావించుకుందాం: "ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగియుండుట." అది మన జీవితాల్లో ఉండవలసినది. ఈ యొక్క పత్రిక అంతటిలో, ప్రేమను గురించే యోహాను వ్రాస్తున్నాడు, దాని ప్రాముఖ్యతను తెలుపుతున్నాడు. "ప్రేమ"[1] అనే పదం KJV అనే ప్రత్యేక అనువాదంలో యిది ఒక నామవాచకంగా మరియు క్రియగా నిలిచి దాదాపు 45 సార్లు మొదటి యోహానులో మనకు కనబడుచున్నది సుమా![2] యోహాను "ప్రేమ అపొస్తలుడు" ఈ "ప్రేమ పత్రికను" వ్రాస్తున్నాడు. ఈ ప్రేమను గురించి ప్రత్యేకముగా నాల్గవ అధ్యాయంలో ప్రస్తావించబడింది. 15 వచనాల్లో (7-21 వచనాలు), యోహాను "ప్రేమ" అనే పదాన్ని 29 సార్లు వాడాడు. యిది ప్రతి 3 వచనాల్లో ఒకసారి కనబడుతుంది.[3] సామాన్యంగా, 1 కొరింథీయులకు 13 అధ్యాయం "ఒక బైబిల్లోని ప్రేమ అధ్యాయంగా" పరిగణింపబడింది. కాని 1 యోహాను 4 అధ్యాయం కూడ ఒక "ప్రేమ" అధ్యాయంగానే మనం పరిగణించవచ్చు.

యోహాను 4వ అధ్యాయంలో రెండు ఉద్దేశాలను నెరవేర్చినాడు: అతడు అబద్ధ బోధకులను గూర్చి హెచ్చరించాడు. తర్వాత సహోదరుల మధ్య ఒకరిపట్ల ఒకరికి ప్రేమ ఉండాలని ప్రోత్సహించాడు. ఈ రెండు ప్రాముఖ్యమైన విషయాలు దేవున్ని సంతృప్తిపరచటానికి మంచి పునాదిగా నిలుస్తుంది: మనము మంచి సిద్ధాంతాలు కల్గి జీవించాలి. మరియు ఒకరి పట్ల ఒకరం ప్రేమ కల్గి జీవించాలి సుమా!

4వ అధ్యాయం తప్పుడు బోధకుల పట్ల ఒక హెచ్చరికతో ప్రారంభం అవుతుంది:

> ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి. యేసు క్రీస్తు శరీరధారియై వచ్చెనని, యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది; యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు; దీనినిబట్టియే దేవుని **ఆత్మను** మీరెరుగుదురు. క్రీస్తువిరోధి ఆత్మ వచ్చునని మీరు వినినసంగతి ఇదే; యిదివరకే అది లోకములో ఉన్నది. చిన్నపిల్లలారా, మీరు దేవుని సంబంధులు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటె గొప్పవాడు గనుక మీరు వారిని జయించియున్నారు. వారు లోకసంబంధులు గనుక లోకసంబంధులైనట్టు మాటలాడుదురు, లోకము వారి మాట వినును. మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మన మాట వినును, దేవుని

సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపమైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో తెలిసికొనుచున్నాము (1 యోహాను 4:1-6).

ఈ తప్పుడు బోధకులు లేదా తప్పుడు ప్రవక్తలు యేసు క్రీస్తు శరీరధారికాలేదు అంటూ ప్రజలను వారి బోధలతో మోసగిస్తున్నారు. వారు పైకి దేవుని ఆత్మతో బోధిస్తున్నామంటూ వాదిస్తున్నారు - కాని వారిలో దేవుని ఆత్మ లేదు. దేవుని యొక్క ఆత్మ ద్వారా మనకు లభించే సందేశాలు వీరి సందేశాలకు విరుద్ధంగా ఉన్నాయి. కాబట్టి తప్పుడు బోధలు బోధిస్తూ బోధకులను అంత్య క్రీస్తు యొక్క ఆత్మ నడిపిస్తుంది అని అనడంలో ఏ అతిశయోక్తి లేదు. వారు క్రీస్తుకు వ్యతిరేకులు. వారి బోధలు వినడానికి ఎంతో మంది సిద్ధంగా ఉన్నారు: "లోకం వారి బోధలు వింటున్నది" (5 వచనం). యోహాను రచనల చదువరులు వారి బోధలు అంగీకరించినవారి గుంపులో లేరు. వారు "సత్య ఆత్మతో" ఒక బోధకుడు నడిపించ బడుచున్నాడా! లేదా "తప్పుడు ఆత్మతో" నడిపించబడి బోధిస్తున్నాడా! అనే విషయాన్ని యిప్పుడే గుర్తించగలరు.

ఈ తప్పుడు బోధకుల గురించి హెచ్చరించిన తర్వాత యోహాను తన హృదయానికి ప్రియమైన అంశానికి తిరిగి వస్తున్నాడు: దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు మరియు మన ప్రేమ ఒకరితోనొకరము పంచుకొనవలసివున్నది.

ఈ అధ్యాయంలోని ఈ భాగంలో మనం ఒకరినొకరం ప్రేమించుకోవాలి అని యోహాను ప్రత్యేకంగా చెప్తున్నాడు. "మనం ఒకరినొకరం ప్రేమించుకోవడంలో" గల అనేక కారణాలను మనకు ప్రస్తావిస్తున్నాడు.

### దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు గనుక (1 యోహాను 4:7-11)

ఈ పాఠానికి ప్రధానాంశము, "ఒకరియెడల ఒకరికి ప్రేమ," యిది ఈ అధ్యాయాల్లోని అంశాలకు సమానమైనది కాదు, దీంట్లో క్రైస్తవులముగా మనకున్న ఆశీర్వాదాల గురించి అవి మనకు ప్రత్యేకంగా చెప్పుతున్నాయి: "ఒకరి పట్ల ఒకరికి ప్రేమ" అనేది మన బాధ్యతను గుర్తు చేస్తున్నది. ఏది ఏమైనప్పటికి, ప్రేమ అనేది ఒక ఆశీర్వాదం. యోహాను మన పట్ల ఉన్న దేవుని ప్రేమను గురించి బోధిస్తున్నాడు. దేవుని ప్రేమ అనేది 1 యోహాను పత్రికలో అతి ప్రాముఖ్యమైన వాస్తవాలలో ఒకటి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

*వాస్తవమైన దేవుని ప్రేమ.* ఈ పత్రికలో "ప్రేమ" గురించి చెప్పడానికి అనేక సత్యాలు యోహాను హృదయంలో నిక్షిప్తమై ఉన్నాయి, ప్రత్యేకముగా 1 యోహాను 4వ అధ్యాయంలో ఈ భాగాన్ని అతడు ప్రేమ అనే కథతో "ప్రేమను" గురించి బోధించ ప్రారంభించాడు: "ప్రేమ" అనే దానితో ప్రారంభించాడు. ప్రేమ కథను బోధిస్తున్నాడు: "ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము; ఏలయనగా ప్రేమ దేవునిమూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును" (1 యోహాను 4:7). మనం ఒకరినొకరం ప్రేమించు అనే దాని గురించి మరల మరల మనకు యోహాను తెలియజేస్తూ, దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు గనుక అంటూ ముగిస్తున్నాడు:

దేవుడు ప్రేమాస్వరూపి (1 యోహాను 4:8; మరియు 4:16 చూడు).

మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి

> పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను (1 యోహాను 4:9).
>
> మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది (1 యోహాను 4:10; 3:1 చూడు).

ఈ విధంగా అతడు తెలియజేస్తున్నాడు: "ప్రియులారా, దేవుడు మనలను ఈలాగు ప్రేమింపగా మనమొకనినొకడు ప్రేమింప బద్ధులమై యున్నాము" (1 యోహాను 4:11). తర్వాత ఈ అధ్యాయంలో "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1 యోహాను 4:19).

మనం ప్రేమించుటలో మనకున్న ప్రాముఖ్యమైన ఉద్దేశం – దేవుడు ప్రేమిస్తున్న రీతిగా మనం ఒకరినొకరిని ప్రేమించాలని అన్న సత్యాన్ని మనం గ్రహించాలి. దేవుడు ప్రేమయైయున్నాడు. అది దేవుని గుణలక్షణమైవున్నది. మనం కూడ ఆ ప్రేమను కనుపరచుటలో దేవునిలాంటి స్వభావం కావాలి. ఎవరైనాసరే నిన్ను చూచినప్పుడు యితడు [లేక ఆమె] "ప్రేమించువాడు" అంటూ నీ గుణలక్ష్యం గురించి చెప్పడానికి ఆ విధంగా నీవు జీవిస్తున్నావా!

## దేవుని ప్రేమ ఎలాంటిదైయున్నది?

*దేవుని యొక్క ప్రేమలోని గుణలక్షణములు: దేవుని ప్రేమ ప్రత్యక్షపరచబడియున్నది* అనేది దానికి మూలాంశం అయివున్నది (1 యోహాను 4:9). దేవుడు ఆకాశంలోనే కూర్చొని "నిన్ను ప్రేమిస్తున్నాను" అని ఉత్తరం పంపలేదు. ఆయన చెప్పిన దానిని బట్టి తన ప్రేమను మనకు వ్యక్తంచేయలేదు గాని ఆయన చేసిన దానిని బట్టి దాన్ని ఆయన వ్యక్తం చేశాడు. ఆయన కుమారుడు, మన పక్షంగా చనిపోవడానికి ఆయనను ప్రసాదించాడు. అదేవిధంగా మనం మసలుకోవాలని యోహాను కూడ మనలను గద్దిస్తున్నాడు:

> ఈ లోకపు జీవనోపాధిగలవాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? చిన్నపిల్లలారా, మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము (1 యోహాను 3:17, 18).

క్రైస్తవులముగా మనము "పరిశుద్ధ ముద్దుతోను" కౌగిలింపులతోను, ఒకరినొకరికి శుభములు చెప్పుకొనుటలోను మన సహోదరీ సహోదరుల పట్ల మన ప్రేమను వ్యక్తం చేసుకొనుట ఎంతో గొప్ప విషయమైనను, అంతకంటే గొప్ప విషయం ఏమిటంటే ఒకరికి ఒకరు సహాయం చేసుకొనుటయైవున్నది. కొంత మంది క్రైస్తవులు "నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అని తరుచుగా చెప్తుంటారు కాని వారి ప్రేమను కనపర్చరు. కొందరు "నిన్ను ప్రేమిస్తున్నాని" తరుచుగా చెప్తున్నా వారి ప్రేమను నిజంగా వారి సహోదరులకు ధారాళముగా సహాయం చేయుటలో కనుపర్చరు.

- ఆహారం కావాలంటే వారికి ఆహారం దయచేస్తారు.
- ఎవరినైనా వారి వాహనం పై తీసుకొని వెళ్ళాలంటే వారి వాహనాన్ని వారితో

పంచుకుంటారు.

- ఎవరైనా పరదేశులు తలదాల్చుకోవాలంటే, వారికి వారి గృహ ద్వారాలు తెరచివుంచుతారు.
- మీలో ఎవరైనను రోగియైవుంటే వారి దగ్గర మీరు కూర్చుని కొంత సమయం గడుపుటకు మీరు సిద్ధంగా ఉండాలి/ఉంటారు, లేదా ఎవరైనా తన ప్రియులను పోగొట్టుకున్న అభాగ్యులు ఉన్నట్టయితే వారి ప్రక్కన మీరు కూర్చోని ఆధరించుట ఎంతో ఉత్తమమం.
- ఎవరికైనా డబ్బు కావాలంటే వారితో నీవు, "సమాధానముగా వెళ్లుడి, చలికాచుకొనుడి, తృప్తిపొందుడని" (యాకోబు 2:16) చెప్పవు. అక్కరలో ఉన్న సహోదరుని యెడల వారి హృదయాన్ని మూసివేయరు (1 యోహాను 3:17), కాని వారి అక్కరకు ఆర్థికంగా సహాయం చేస్తారు.

ఈ రెండు రకాలైన క్రైస్తవుల్లో, ఒకరు "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అంటూ నిజంగా తన ప్రేమను కనుపరచడు, మరో వ్యక్తి నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పక పోయినప్పటికి అవతలవాని కష్టంలో సహాయం చేస్తూ తన ప్రేమను కనుపర్చాడు. వీరిలో దేవుడు ప్రేమించిన విధంగా తన సహోదరులను నిజంగా ప్రేమించినవాడు ఎవరు?

దేవుని ప్రేమ ఒక్కటే *యిక్కడ కనుపర్చబడలేదు.* అది యింత అద్భుతంగా కనుపర్చ బడింది: *దేవుడు మనలను, లోకమును ఎంతో ప్రేమించెను; మన కొరకు, లోకంకొరకు మరణించుటకు ఆయన తన అద్వితీయ కుమారుని అనుగ్రహించాడు.* మనము మన సహోదరులను ఎంతో ప్రేమించాలంటే వారి కొరకు మనం ప్రాణం పెట్టునంతగా ప్రేమించాలి. యిక్కడ 1 యోహాను 3:16ను గమనించాలి: "ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము."

మొదటి శతాబ్దంలో, క్రైస్తవులు ఒకరికోసం ఒకరు మరణించుట ఎంతో ఆవశ్యకమైన పరిస్థితి. మనము ఆ దినాల్లోనే జీవించివుండివుంటే, యేసును గనుక వదులుకొన్నట్టయితే అలాంటి విశ్వాసులను తప్పనిసరిగా చంపాలని అధికారి జారిచేసిన శాసనాలకు విధేయత చూపాల్సివచ్చేది. ఒక వేళ నీవు గనుక పట్టబడితే; అప్పుడు నీ పొరుగువాడు నిన్ను చూచి నీవు క్రైస్తవుడవేనని సాక్ష్యం యిచ్చియుండేవాడు. అప్పుడు న్యాయవాది యిలా అంటాడు, "నీవు శిక్షకు అర్హుడవై నీవు తప్పక మరణానికి అప్పగించబడవలసి ఉంది. ఎలాగైన నీవు గనుక ఈ సంఘంలోని యితర క్రైస్తవులపట్ల మీకు చెప్పినట్లే నిన్ను విడుదలచేసి క్షమిస్తాము. అప్పుడు నీవు యేసును యథావిధిగా ఆరాధించుకోగలవు కాబట్టి వెంటనే ఆ పేర్లను మాకిచ్చేయి. అప్పుడు నీవు ఏమిచేస్తావు? క్రీస్తులో ఉన్న నీ సహోదరుల పేర్లను వారికి అప్పగించి యిక నీవు బ్రతకటానికి తప్పించుకుంటావా? లేదా నిన్ను శిక్షించేవాళ్ళు ఏమి కావాలని అడిగారో అది వారికి అప్పగించకుండా మరణానికి సిద్ధపడతావా?" ఆ దినాల్లో నీవు గనుక నీ సహోదరులకు ప్రేమ కనుపర్చాలంటే అక్షరార్థంగా వారికోసం నీవు చావాల్సిందే.

ఈ దినాల్లో, కొన్ని స్థలాల్లో యిలాంటి దృశ్యాన్నే మనం ఎదుర్కోవాలి. మన పిలుపుకు తగినట్టుగా మనం జీవిస్తూ దేవుడు ప్రేమించినట్టుగానే – మనం ప్రేమిస్తూ మన

సహోదరులకొరకు ప్రాణం పెట్టడానికైనా సంసిద్ధంగా ఉండాలి కదా?

ఇంకా ముందుకు చూచినట్టయితే, *యేసు మరణం ద్వారా దేవుని యొక్క ప్రేమ ప్రత్యక్షపరచబడింది. అది భక్తిగలవారి కోసం కాదు, కాని పాపుల కోసం, రక్షణకు అనర్హులైనవారికోసం.* యోహాను యిలా అంటున్నాడు, "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది" (1 యోహాను 4:10). ఆయనను ఎంతగానో ప్రేమించావు కాబట్టి దేవుడు మనలను ప్రేమించడం లేదు; ఆయన మనం పాపులమైవున్నప్పటికి మనలను ప్రేమించాడు (రోమీయులకు 5:8 చూడు). ప్రేమింపబద్ధులమైనవారం కాకపోయినను ఆయన మనలను ప్రేమించాడు.

దేవుడు ప్రేమించిన రీతిగా మనం ప్రేమించాలంటే, మనం కూడ ప్రేమకు పాత్రులు కాని వారిని కూడ ప్రేమించుటకు సిద్ధంగా ఉండాలి. బహుశ అది కష్టమైన పనియైవుండవచ్చు! ప్రేమకు అర్హులు అనబడినవారిని ప్రేమించడం ఎంతో సులువైన విషయం, కాని ప్రేమకు అర్హులు కానివారు ఎంతో కోపిస్టులు, కృతజ్ఞతలేని ప్రజలు. మనకు యిష్టంలేని గుణలక్షణం గలవారిని ప్రేమించుట సాధ్యమా? మనలను ప్రేమించనివారిని, గౌరవించనివారిని, అసలు మనమంటే యిష్టపడనివారిని ప్రేమించడం ఎలా నేర్చుకోగలం? మన శత్రువులను ఎలా ప్రేమించగలం?

ఆ ప్రశ్నకు ఒక జవాబు ఏమిటంటే, బైబిల్ ప్రబోధిస్తున్న ప్రేమ ప్రాముఖ్యంగా మానవ భావోద్రేకాలకు పరిమితమైంది కాదు. అంతేకాక బైబిల్ సంబంధమైన ప్రేమ అనగా మనం ప్రేమించేవారికి ఏది శ్రేష్ఠమైందా? అన్న దాన్ని నిశ్చయించుకొనుటయే. ఉదాహరణంగా మన సంఘంలోని కొందరు వ్యక్తులను ప్రేమించడం మనకొక సమస్యగా మిగిలిపోయిన దోరనిగా ఉన్నప్పుడు మనం వారిని గురించి ఏమైన *అనుకోవచ్చుగాని* తప్పక *ప్రేమించాలి.* అనగా వారికొక మేలు చేయాలనే ఉద్దేశంతో ఆధరణగా ఆదరించాలనే ఉద్దేశంతో మరియు ఎంతో ఓర్పు కల్గి వారిపట్ల వ్యవహరించాలన్న రీతిలో (1 కొరింథీయులకు 13:4–7) ప్రేమించాలి.

ఒక ప్రాముఖ్యమైన సత్యం మనం యిక్కడ గుర్తుంచుకోవలసి ఉన్నది. ఏమిటంటే, మన సహోదరులను ప్రేమించుట మన యిష్టపూర్వకమైన విధిగా నెరవేర్చబడిందికాదు. కాని అది తప్పక చేయవలసినది. 1 యోహాను 3:11 గమనిద్దాం: "మనమొకని నొకడు ప్రేమింపవలెననునది మొదటనుండి మీరు వినిన వర్తమానమేగదా." తర్వాత 1 యోహాను 3:23 చూద్దాం: "ఆయన ఆజ్ఞ యేదనగా – ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన మనకు ఆజ్ఞనిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింపవలెననునదియే." తర్వాత 1 యోహాను 4:21ని చదువు: "దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను[4] మనమాయనవలన పొందియున్నాము." "నిరుచ్ఛాహపరచే కార్యాలను చేసే సహోదరులను నేను ఎలా ప్రేమించగలను" అని నీవు అడిగినట్టయితే? దానికి యిదే జవాబు నీవు వారిని ప్రేమించటంలో ఒక మార్గాన్ని ఎన్నుకోవాలి సుమా! ప్రేమ అనేది నీవు చేయగల్గింది కాదు, ప్రేమ నీవు తప్పక *చేయ*వలసింది సుమా!

దేవుని ప్రేమ అయోగ్యులమైన మనకొరకు మరణించుటకై తన కుమారున్ని పంపుటలో ప్రత్యక్షపరచబడింది. అలాంటి ప్రేమనే మనము ఒకరికొకరం చూపింపబద్ధులమై ఉన్నాము.

## అది మనం చేసినట్టయితే, దేవుడు మనలో నివసిస్తాడు (1 యోహాను 4:12-16)

> ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు; మనమొకని నొకడు ప్రేమించినయెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును. దీనివలన మనము ఆయనయందు నిలిచియున్నామనియు ఆయన మనయందున్నాడనియు తెలిసికొనుచున్నాము; ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసి యున్నాడు. మరియు తండ్రి తన కుమారుని లోకరక్షకుడుగా ఉండుటకు పంపియుండుట మేము చూచి, సాక్ష్యమిచ్చుచున్నాము.
>
> యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో, వానిలో దేవుడు నిలిచియున్నాడు, వాడు దేవునియందున్నాడు. మనయెడల దేవునికి ఉన్న ప్రేమను మనమెరిగినవారమై దాని నమ్ముకొనియున్నాము; దేవుడు ప్రేమాస్వరూపియై యున్నాడు; ప్రేమయందు నిలిచియుండువాడు దేవునియందు నిలిచియున్నాడు, దేవుడు వానియందు నిలిచియున్నాడు.

దేవునితో సహవాసం - మనం ఆయనలో ఉండుట, ఆయన మనలో జీవించుట అనేదే క్రైస్తవ జీవితంలో ప్రాముఖ్యమైన లక్ష్యం. ఆ సహవాసం మనం కల్గివున్నామని ఎలా తెలుసుకోగలం? 1 యోహాను 4:12-16 ప్రకారము క్రింది కారణాలను బట్టి అటువంటి సహవాసం మనకు కలదని స్పష్టం చేసుకోగలం:

(1) మనం ఒకరినొకరు ప్రేమించుకోవలెను (4:12; చూడు 16 వచనం).
(2) ఆయన తన ఆత్మను మనకనుగ్రహించివున్నాడు (4:13).
(3) అపొస్తలుల సాక్ష్యమును మనం నమ్ముచున్నాము మరియు యేసు క్రీస్తు దేవుని కుమారుడని మనం ఒప్పుకున్నాము (4:14, 15).
(4) మనయెడల ఉన్న దేవుని ప్రేమను మనం ఎరిగివున్నాము (4:16).

మనం "ఒకరినొకరం ప్రేమించుట" ద్వారా దేవునియందు మనం నిలిచివున్నామని, ఆయన మనలో నిలిచివున్నాడని ఎరుగుదుము. ఒకవేళ అప్పటికిని క్రీస్తులో మన సహోదరులను మన సహోదరీలను ప్రేమించనట్టయితే దేవునితో మన సహవాసం ఉండదు సుమా!

## ప్రేమ అనునది ధైర్యమును పుట్టించును కాబట్టి (1 యోహాను 4:17, 18)

> తీర్పుదినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరపూర్ణము చేయబడియున్నది; ఏలయనగా ఆయన ఎట్టివాడై యున్నాడో మనము కూడ ఈ లోకములో అట్టివారమై యున్నాము. ప్రేమలో భయముండదు; అంతేకాదు; పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును; భయము దండనతో కూడినది; భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు.

మనము "గొప్ప దినం రాబోవుతుంది" అని పాట పాడుతాం. ఎంతోమంది ప్రజలు తీర్పు దినము రాబోతుందని ఎరిగి, ఆ దినముకొరకు ఎంతో భయంతో ఎదురు చూస్తారు. ఏది ఏమైవున్నప్పటికి భయపడే అవసరం లేదని అంటున్నాడు, "తీర్పుదినమందు మనకు ధైర్యము కలుగునట్లు" (4:17) అంతేగాక "ప్రేమలో భయముండదు; పరిపూర్ణ ప్రేమ భయమును

వెళ్లగొట్టును" (4:18ఎ) అని కూడ అంటున్నాడు.

భయాన్ని తొలగిస్తూ తీర్పు దినాన్ని ఎదుర్కొటానికి ధైర్యమును కల్గించే ఆ "పరిపూర్ణ ప్రేమ" ఏమిటి? అది పరిపూర్ణమైన "ప్రేమ" (1 యోహాను 4:17; 2:5 చూడు). మనం ఒకరినొకరం ప్రేమించిన యెడల, "ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును" (4:18; 12 వచనం చూడు). "పరిపూర్ణత చేయబడుట" అనగా "సంపూర్ణంగా" అనుటకు సమానంగా ఉన్నది. మనం ప్రేమించు క్రైస్తవులుగా ఎదిగినయెడల దేవుని ప్రేమ పరిపూర్ణమగునని యోహాను చెప్పుతున్నాడు.[5]

దేవుడు మానవులను ప్రేమించుట అన్న సత్యం ఈ లోకంలో తండ్రి పిల్లలు ఒకరినొకరు ప్రేమించుకోవాలి అన్న ఉద్దేశంతో చేసే ప్రయత్నంలాంటిది అని మనం గ్రహించాలి. కొన్ని సార్లు మన పిల్లలకు మనం యితరులను ప్రేమించుమని, అందరితో మంచిగా, దయతో ప్రవర్తించుమని బోధలు చేస్తుంటాము. ఈ బోధలను కొన్ని సార్లు మనం వారు యితరుల యెడల మంచిగా వ్యవహరించినప్పుడు వారికి బహుమానాలు యిస్తూ, ఎప్పుడైతే వారు యితరులతో అసమానంగా వ్యవహరించినప్పుడు వారిని శిక్షించడం చేస్తుంటాం. మనము మన జీవితంలో దయ, కనికరాలను మన గుణశీలంలో అలవరచుకుందాం అని మనం నిరీక్షించుచుండవచ్చు, ప్రేమ అనేది ఎలాంటిదో ఉదాహరణల ద్వారా మన పిల్లలకు బోధించడానికి ప్రయత్నం చేస్తుండవచ్చు. అయినప్పటికి మన పని యింకా సంపూర్తి కాలేదు. ఎప్పుడైతే మన పిల్లలు వారికై వారు స్వతాగా యితరులకు ప్రేమ కనపరచినప్పుడు అప్పుడే మనం పని ముగించినట్టుగా మనం గ్రహించగలం. మనం ఎప్పుడేదైతే చూస్తామో అప్పుడు మనం సంతృప్తితో చెలించిపోతాము. పరిపూర్ణం అయింది కదా అని మనం ఆలోచిస్తాము. అదే విధముగా దేవుడు కూడ సంతృప్తిపడతాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి మన పట్ల ఆయనకున్న ప్రేమ మన జీవితాల్లో ఫలభరితమైన ఆ ప్రేమను యితరులకు మనం కనపరచుకోవటంలో ద్విగుణికృతమైనది.

దీనికి విరుద్ధంగా, మనం గనుక యితరులను – ప్రేమించటంలో విఫలులమైనామంటే దేవుని ప్రేమ మనలో పరిపూర్ణం కాలేదని గ్రహించగలం, అది అసంపూర్ణమైనది. దేవుడు దేనిని నెరవేర్చాలని అనుకొన్నాడో దానిని అది నెరవేర్చలేదు.

తీర్పు దినం గూర్చి నీవు ఏమనుకుంటున్నావు? నీవు ఎంతో ధైర్యముతో ఉన్నావా? లేక భయపడుతున్నావా? నీవు, దేవుని బిడ్డవైతే యితరుల పట్ల ప్రేమను చూపిస్తావు, నీలో ఏ భయంవుండదు, ఎందుచేతనంటే, "పరిపూర్ణ ప్రేమ భయాన్ని పారదోలుతుంది కాబట్టి."

## దేవుణ్ణి మనం ప్రేమిస్తున్నాం కాబట్టి (1 యోహాను 4:19-21)

> ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను – నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయనవలన పొందియున్నాము.

దేవుని ప్రేమకు మన తొలి స్పందన ఎలా ఉండాలంటే, మనం దేవుని తిరిగి ప్రేమించుటకు ఆతృత కల్గియుండాలి. మనపట్ల దేవుని ప్రేమ గురించి యోహాను ఎంతో

ప్రత్యేకించి ప్రస్తావించుచున్నాడు. ఆయన పట్ల మన ప్రేమను కూడ వ్యక్తపర్చుచున్నాడు. “నేను దేవుని ప్రేమిస్తున్నాను” (20 వచనం) అని చెప్పేవారి గురించి యోహాను ప్రస్తావిస్తున్నాడు, అంటే ఆ రోజుల్లో క్రైస్తవులు తండ్రి పట్ల వారి ప్రేమను స్పష్టపరచే విధానంలో (1 యోహాను 2:15; 4:21; 4:10; 5:1–3 చూడు).

మనము దేవుణ్ణి ప్రేమించిన యెడల మన సహోదరులను ఎంతబాగా మనం ప్రేమించాలో ఊహించండి? యిక్కడ కొన్ని వాస్తవాలున్నాయి. (a) మానవులంతా దేవుని సారూప్యంలోనికి చేయబడినారు. (b) కొందరు ఆయన ప్రేమకు అర్హులు కానప్పటికి, దేవుడు ప్రజలందరిని సమానంగా ప్రేమిస్తున్నాడు. (c) దేవుని పిల్లలనబడినవారు దేవుని చేత ప్రత్యేకంగా ప్రేమించబడి ఆశీర్వదించబడినవారు దేవుని లక్ష్యణాల్లో పాలుపొంపులు కల్గియుంటారు: “ఆయన ఎట్టివాడై యున్నాడో మనము కూడ ఈ లోకములో అట్టివారమై యున్నాము” (1 యోహాను 4:17). (d) క్రైస్తవులుగా మారినవారు క్రీస్తులో మన సహోదరులు, సహోదరీలు. మనం వారికొరకు మరణించ బద్ధులమైయున్నాము (1 యోహాను 3:16)! అలాంటప్పుడు వారు “దేవుని ప్రేమించుచున్నామని” చెబుతున్న వ్యక్తి తన సహోదరుని ఎలా ద్వేషించగలడు? (1 యోహాను 4:19, 20) దాన్ని మనం యిలా చెప్పవచ్చు: “నీ పూర్ణ హృదయంతో నీ ప్రభువైన దేవుని ప్రేమించుట” అనే మొట్టమొదటి ఆజ్ఞ “నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించు” అనే రెండవ ఆజ్ఞకు విధేయత చూపించనంతవరకు నిజంగా విధేయత చూపలేవని తెల్పవచ్చు (మత్తయి 22:37–39).

అసలు మనమేమి చేయవలెను? మనపట్ల, యితరులపట్ల దేవుని ప్రేమయున్నది కాబట్టి మనం ఆయనను ప్రేమించవలెను; ఆయన మనలను ప్రేమించుచున్నాడు గనుక యితరులను కూడ ప్రేమించవలెను. అందుకే యోహాను స్పష్టం చేస్తున్నాడు, “దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయనవలన పొందియున్నాము” (1 యోహాను 4:21).

1 యోహాను 4:19–12 వాక్య భాగం మత్తయి సువార్తలోని 23వ అధ్యాయంలో యేసు మాటలకు సాదృశ్యంగా ఉన్నాయి. యేసు శాస్త్రులను, పరిసయ్యులను ఉద్దేశించి వేషధారులారా అంటూ వారిని గద్దించిన సందర్భమది. వారితో ఆయన యిలా అంటున్నాడు, “మీరు మనుష్యులయెదుట పరలోక రాజ్యమును మూయుదురు; మీరందులో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు” (మత్తయి 23:14). వారు బీదవారిని నిర్లక్ష్యం చేస్తూ వారిని పట్టించుకోలేదు, తక్కువ చూపు చూసినా, అలా చేస్తూ కూడ వారెంతో గొప్ప మత నిష్టాగరిష్టులు అనే విషయాన్ని పదిమందికి చాటుకున్నారు. ఇంకా యేసు యిలా అంటున్నారు, “అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు పుదీనాలోను సోపులోను జీలకఱ్ఱలోను పదియవ వంతు చెల్లించి, ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములను, అనగా న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపెట్టితిరి; వాటిని మానక వీటిని చేయవలసియుండెను” (మత్తయి 23:23). యోహాను కూడ యిలాంటి మాటలే అనడం లేదా? బహుశా ఆ సహోదరులు సహవాస కూడికకు క్రమంగా వెళ్ళియుండవచ్చు, పెద్దగా అరుస్తూ ప్రార్థించియుండవచ్చు, ఎలుగెత్తి పాటలు పాడివుండవచ్చు. ఓ! మాకు దేవుడంటే ఎంత ప్రేమ అని గొప్పలు చెప్పుకొనియుండవచ్చు. ఇంత చేసినా వారు గనుక ఒకరినొకరు తక్కువ చూపు చూస్తూ కించపర్చుచు వారి అక్కరలోవున్న సహోదరుల అక్కరలను తీర్చి వారిని

ఆదుకోవడానికి నిర్లక్షం చేయడం చేస్తున్నారంటే దేవునియెడల ప్రేమ కలిగియున్నామని చెప్పుకోడం వ్యర్థం. “తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు (అతని అక్కరలను తీర్చుట ద్వారా, అతనికి సహాయం చేయుట ద్వారా) తాను చూడని దేవుని ప్రేమింపలేడు.”[6]

## ముగింపు

మనం ముగిస్తుండగా, మనం మన ఆత్మీయ స్థితిని పరీక్షించుకోవలసియున్నది. మనం కొన్నిసార్లు “ఏం పరవాలేదు నా ఆత్మ నిబ్బరంగావుంది” అని పాటలు పాడవచ్చు.[7] నిజంగా నీ ఆత్మ అంత బాగా ఉందా? ఎలా తెల్సుకోగల్గుచున్నావు? నీవు గనుక యేసు క్రీస్తు దేవుని కుమారుడని, శరీరధారియైన దేవుడని తెలుసుకొని విధేయులైతే నీవు బాగుగా చేసినవాడవవుతావు. నీవు గనుక ప్రభువు ఆజ్ఞకు విధేయత చూపించి దేవుని బిడ్డవైన తర్వాత, నీవు దానియందు సంతోషించి ఆయన కృపను బట్టి ఆయనకు కృతజ్ఞతలు చెల్లించగలవు. ఎందుకంటే, ఆయన దేవునితోను, క్రీస్తు శరీరమనబడిన ఆయన పరిశుద్ధులతోను సహవాసం గలిగి జీవించడానికి గొప్ప ఆధిక్యత నీకిచ్చినందుకు కృతజ్ఞతలు చెల్లించు. క్రీస్తు సిలువలో మరణించడం ద్వారా నీవు రక్షించబడియున్నట్టయితే, మరియు అనుదిన జీవితంలో పాపం చేసే అలవాటునుండి తప్పించుకోడానికి ప్రయత్నిస్తుంటే, దేవుడు నీకిచ్చిన రక్షణ నిమిత్తం ఆయనను స్తుతించవలెను.

ఇక అంతటితో సరిపోతుందా? మనం సరైన సిద్ధాంతాన్ని నమ్మడంవరకే కాదు, సువార్తకు విధేయత చూపాలి, ప్రభువు సంఘంలోని యితర విశ్వాసులతో సహవాసంలో కొనసాగాలి, ఆరాధనలో ఆయనను స్తుతించాలి మరియు వ్యక్తిగత జీవితంలో పాపానికి దూరంగా ఉండడానికి తాపత్రయపడాలి, “మన ఆత్మతో, ఆహా యిక చాలు” అని చెప్పడానికి యింతవరకు సరిపోతుందా లేక యింకా కొంత ఎక్కువ కావాలా?

వాస్తవానికి, నమ్మకమైన క్రైస్తవునిగా జీవించడానికి యింకా ఎక్కువే కావాలి సుమా! ఒకరినొకరు ప్రేమించుకొనుట ద్వారా క్రైస్తవులుగా వారి ప్రేమను కనబరచవలసియున్నది; ఆ ప్రేమ కేవలం మాటల పొందికలో జరిగేది కాదు కాని చేతులతో చూపించవలసియున్నది. నీ తోటి క్రైస్తవుల పట్ల నీ ప్రేమను కనబర్చుచున్నావా? సహోదరులపట్ల నీ ప్రేమను కనుబర్చుటకు నీకు మించినది ఏది చేసి వారి అక్కరలు తీర్చావు? అలా చేయనట్టయితే నీ ఆత్మీయ పరిస్థితి ఏమిటి?

---

సూచనలు

[1]బహుశ *agape* అనే గ్రీకు పద రూపంనుండి అనువదించబడినది. [2]ఈ లెక్కింపు Robert Young, *Young's Analytical Concordance to the Bible* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.), 622-23 నుండి వచ్చింది. [3]ఈ మూడు వచనాలు – 1 యోహాను 4:13–15 భాగంలో “ప్రేమ” అనే మాట లేదు. అది ఒక చర్చనీయాంశంగా మిగిలిపోయింది: దేవుని ప్రేమ ఒక క్రైస్తవునికి, క్రైస్తవుని ప్రేమ యితరులకు. [4]1 యోహాను 2:7–11; 3:11 కూడు చూడు. [5]“ఒకరినొకడు ప్రేమించుట” ధైర్యాన్ని కలిగిస్తుంది. యోహానేమంటున్నాడంటే, “మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములోనుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము. ప్రేమ లేనివాడు మరణమందు నిలిచియున్నాడు” (1 యోహాను 3:14). [6]“ఎవరు ఎప్పుడును దేవున్ని చూడలేదు” (12 వచనం) అనియున్నప్పుడు కొందరు బైబిల్లోని వ్యక్తులు దేవున్ని చూచారు అని చెబుతున్నారెందుకు? “దేవుడు ఆత్మ” గనుక (యోహాను 4:24), భౌతిక నేత్రం దేవుని చూడలేదు. ఆత్మ అన్నది నిర్వచించడం ద్వారా అది కనబడనిది అని అర్థం. అందువల్ల ఒక మనిషి తాను దేవుని చూచాడు అంటే

అతడు నిజంగా దేవుణ్ణి చూడలేదు. కాని దేవుని ప్రత్యక్షతను మాత్రమే చూచాడని అర్థం. బైబిలు రోజుల్లో దేవుడు తన్నుతాను అనేక రీతులుగా మానవులకు ప్రత్యక్షపరచుకొన్నాడు. ఉదాహరణకు, మండుచున్న పొద, కొన్నిసార్లు మనిషి రూపంలో. యిక్కడ ఆ ప్రత్యక్షత నిజానికి (ఆత్మ స్వరూపియైన) దేవుడు కాదు కాని దేవుని ప్రాతినిధ్యం మాత్రమే. (John R. W. Stott, *The Epistles of John,* The Tyndale New Testament Commentaries [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960], 163.) [7]Horatio G. Spafford, "It Is Well with My Soul," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).

---

## "అంత్య క్రీస్తు"

"అంత్య క్రీస్తు" అనే మాటకు అర్థం "క్రీస్తుకు వ్యతిరేఖి." క్రొత్త నిబంధనలో యోహాను ఒక్కడే ఈ మాటను వ్యక్తపరచినవాడు; ఇది మనకు 1 యోహాను 2:18; 2:22; 4:3; మరియు 2 యోహాను 7లో కనిపిస్తుంది. ఈ వాక్య భాగాలు ఏమి బోధిస్తున్నాయంటే:

- యోహాను యొక్క పాఠకులు అంత్య క్రీస్తు చివరి గడియలో వస్తున్నాడని విన్నారు (1 యోహాను 2:18).
- ఎంతో మంది అంత్య క్రీస్తులు కనిపించారు; అందువల్ల యిది చివరి గడియగా పరిగణింపబడింది (1 యోహాను 2:18).
- ఎవరైనాసరే యేసే క్రీస్తని ఒప్పుకొనరో అతడు అంత్య క్రీస్తు (1 యోహాను 2:22).
- ఎవరైతే యేసుక్రీస్తు ఈలోకానికి శరీరధారిగా వచ్చారని ఒప్పుకోరో అటువంటి వారు అంత్య క్రీస్తు ఆత్మను కనుబరచినవారు అవుతారు (1 యోహాను 4:3).
- యోహాను ఈ పత్రికలు వ్రాసినప్పుడే అంత్య క్రీస్తు ఈ లోకంలో ఉన్నాడు (1 యోహాను 4:3).
- ఈ తప్పుడు బోధకులు మరియు మోసగాళ్ళు అంత్య క్రీస్తుతో సమానమైనవారుగా ఎంచబడినారు (2 యోహాను 7).

అంత్య క్రీస్తును గురించినటువంటి కొన్ని వాస్తవాలను యిప్పటివరకు మనం గమనించివున్నాము, వ్యాఖ్యాన కర్తలు అంత్య క్రీస్తును ఈ విధంగా పోలుస్తున్నారు, 2 థెస్సలొనీకయులకు 2:1–10లో "ధర్మ విరోధి" "ప్రభువు యొక్క దినం" రాకముందే వస్తాడు. ఈ యొక్క వ్యాఖ్యానం ప్రకారము యోహాను దినాల్లోని "అంత్య క్రీస్తు" ఆఖరి గడియలో[1] వచ్చే అంత్య క్రీస్తు యొక్క ఆత్మలో పాలిభాగస్తుడై ఉన్నాడు.

గై ఎన్. ఉడ్స్ అనే అతను ఈ అంత్య క్రీస్తు అనేవాడు *"రోమా పోప్!"*[2] అని నమ్ముతున్నాడు. గోబెల్ మ్యూజిక్ అనే అతడు ఈ "అంత్య క్రీస్తు" అనేవాడు "ధర్మ విరోధి, సూత్రంలోను లేక ఆత్మలోను దేవుని వాక్యంలో బయలుపరచబడిన నిజమైన సత్యానికి విరుద్ధంగా ఉన్నాడు," ఇది అనేక వేరు వేరు సమయాల్లో స్థలాల్లో అనేక రీతులుగా అగుపిస్తుందని[3] సూచించాడు.

---

సూచనలు

[1]Further information is given in F. F. Bruce, *The Epistles of John: Introduction, Exposition and Notes* (N.p.: Pickering & Inglis, 1970; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 65-68, and W. E. Vine, *The Epistles of John: Light, Love, Life* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1970), 35-36. [2]Guy N. Woods, *A Commentary on the New Testament Epistles of Peter, John, and Jude* (Nashville: Gospel Advocate Co., 1983), 242-43. [3]Goebel Music, "Difficult Passages in 1, 2, 3 John, No. I," *Denton Lectures* (1987), 385.